నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**
**ఆటవెలది**

పరిమలమ్మునుచు విరివిగా గంధమున్
పూసుకోకు మెపుడు వాసనలను
అతిగనేదియైన హానియే కలిగించు
విజయలక్ష్మి వాక్కు వినురనరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 3 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 29-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# కూన కుమ్మేసింది

**భారత్‌పై ఐర్లాండ్ చారిత్రక విజయం**

- రెండో టీ20లో 1 పరుగు తేడాతో గెలుపు
- 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఐర్లాండ్
- తిలక్ వర్మ అర్ధశతకం వృథా..
- టీ20ల్లో తొలిసారి భారత్‌పై సిరీస్ విజయం

ఐర్లాండ్ చరిత్ర సృష్టించగా, ప్రపంచ చాంపియన్‌కు దారుణ భంగపాటు. పేస్, బౌన్స్‌కు అనుకూలించిన పిచ్‌పై వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన టీమ్ ఇండియా టీ20 సిరీస్‌ను 0-2తో ఐర్లాండ్‌కు కోల్పోయింది. దీంతో పొట్టి ఫార్మాట్‌లో వరుసగా 12 సిరీస్ విజయాలు సాధించిన భారత్ జైత్రయాత్రకు పసికూన ఐర్లాండ్ బ్రేక్ వేసింది. ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేయగా, హ్యారీ టెక్టర్ (53) అర్ధ సెంచరీతో రాణించాడు. ఛేదనలో తిలక్ వర్మ (55) అర్ధ సెంచరీతో పోరాడినా భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులే చేసింది. ఒక్క పరుగు తేడాతో ఐర్లాండ్ చేతిలో భారత్ ఓటమి పాలైంది. ఐర్లాండ్ చేతిలో భారత్‌కు ఇది తొలి సిరీస్ ఓటమి.



2లో



## అన్నదాతలకు అండగా 'ప్రజా ప్రభుత్వం'

- 30న చింతకానిలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు ఆశీర్వాద సభ
- రైతులకు సంకెళ్లు వేసిన నాటి పాలకులా నేడు ముసలి కన్నీరు కార్చేది
- భారీ వర్షాలొచ్చినా సభ విజయవంతం కావడం ఖాయం
- ఏర్పాట్ల పరిశీలన అనంతరం మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాహసోపేత నిర్ణయాలతో అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో ఈనెల 30వ తేదీ మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న 'రైతు ఆశీర్వాద సభ' ఏర్పాట్లను పరిశీలించి ఆయన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల భారీ బలగంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలను అంగుళం అంగుళం వీక్షించి, వాతావరణ మార్పులను తట్టుకునేలా జర్మన్ హ్యాంగర్తో అద్భుతమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

-మిగతా 2లో

# ఎస్ఎల్ బీసీ- డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

**మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం**

- నల్గొండలో రూ.1,306 కోట్ల హైవే పనులకు శంకుస్థాపన
- పేదల సంక్షేమమే నా జీవిత లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం..బీఆర్ఎస్, బీజేపీకి బహిరంగ సవాల్
- కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం
- ఆర్అండ్‌బీ, జాతీయ రహదారి పనులకు భారీ నిధులు
- తెలంగాణ భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నాం: నల్లగొండలో 'ప్రజా పాలన- ప్రగతి పాలన' సభలో సీఎం రేవంత్ రెడ్డి

నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

'నల్లగొండ జిల్లాకు సాగు నీరందించే ఎస్ఎల్‌బీసీ--డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్నాం' అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్‌లో రూ. 1,306 కోట్ల వ్యయంతో హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో చేపట్టనున్న ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ సమీపంలో నల్లగొండ--దేవరకొండ ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన హ్యామ్ రోడ్డు ప్రాజెక్టు పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6092.37 కిలోమీటర్ల మేర 441 రహదారుల విస్తరణ అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం నల్లగొండ పట్టణంలో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు.

-మిగతా 2 లో





## బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు ధన్యవాదాలు

- పశ్చిమాసియా సంక్షోభాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటున్నాం
- భద్రత స్వయం సమృద్ధి దిశగా భారత్
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ

పశ్చిమాసియా సంక్షోభంతో ఎదురైన ఉద్రిక్త పరిస్థితుల సమయంలో తాను చేసిన పలు సూచనలకు ప్రజల నుంచి మంచి స్పందన దక్కిందని ప్రధాని మోడీ అన్నారు. ఒక ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను, విదేశీ ప్రయాణాలు తగ్గించుకోవాలని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఆచరణలో పెట్టిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే భారత్ సాధించిన పలు కీలక విజయాలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటున్నట్టు ప్రధాని మోడీ తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల సమయంలో

-మిగతా 2లో

## పాకిస్థాన్ సైన్యంపై ఉగ్రదాడి..

2లో



- నలుగురు జవాన్‌లు మృతి..
- సైన్యం దాడిలో ఆరుగురు ఉగ్రవాదులు హతం..!
- కరాచీలోని సింధ్ రేంజర్ల స్థావరంపై భీకర ఉగ్రదాడి
- పేలుడు పదార్థాల వాహనంతో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు
- దాడికి బాధ్యత వహించిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రసంస్థ



## మళ్లీ యుద్ధమేఘాలు!

- నౌకలపై ఇరాన్ దాడికి అమెరికా ప్రతిదాడులు
- ప్రతీకారంగా కువైట్, బహ్రెయిన్‌లపై ఐఆర్‌జీసీ ఎటాక్
- ఇరాన్ ఆనవాళ్లు కూడా ఉండవని ట్రంప్ వార్నింగ్

2లో

# వైశ్య వ్యాపార శక్తికి ప్రతీకగా వీ వైశ్య గ్లోబల్ కాంక్లేవ్

- విజయవంతంగా ముగిసిన వీ వైశ్య గ్లోబల్ కాంక్లేవ్--2026
- పాల్గొన్న వివిధ రాష్ట్రాల 250 మంది పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు
- వ్యాపారాభివృద్ధి, నెట్‌వర్కింగ్, పరస్పర సహకారానికి కొత్త దిశ









హైదరాబాద్, జూన్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

దేశవ్యాప్తంగా ఉన్న వైశ్య వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు నూతన అవకాశాలకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన వీ వైశ్య గ్లోబల్ కాంక్లేవ్--2026 హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించి విజయవంతంగా ముగించారు. మాదాపూర్‌లోని హోటల్ ఆవాసలో జరిగిన ఈ జాతీయ స్థాయి వ్యాపార సదస్సుకు వివిధ రాష్ట్రాలు, నగరాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు, యువ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి విశేష ఆదరణ కల్పించారు.గ్లోబల్ ప్రెసిడెంట్ మహేంద్ర చీమకుర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కాంక్లేవ్‌ను తెలంగాణ ఎక్స్‌పాన్షన్ లీడ్ డాక్టర్.నిషాంక్ కండె, హైదరాబాద్ వీ వైశ్య కౌండిన్య గ్రూప్ అధ్యక్షుడు శ్రీకాంత్ సమన్వయం చేశారు. వ్యాపార రంగంలో నెలకొన్న సవాళ్లు, అభివృద్ధి అవకాశాలు, పెట్టుబడుల విస్తరణ, భాగస్వామ్యాల పెంపు, మార్కెట్ ధోరణులు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విజయవంతంగా రాణిస్తున్న వ్యాపారవేత్తలు తమ అనుభవాలను పంచుకుంటూ భవిష్యత్ వ్యాపార వ్యూహాలపై విలువైన సూచనలు అందించారు.

**నేను' నుంచి 'మనం' వైపు...**

Stop Thinking I... Start Thinking We అనే నినాదంతో ముందుకు సాగుతున్న వీ వైశ్య గ్లోబల్ సంస్థ, సమిష్టి కృషి ద్వారానే స్థిరమైన విజయాలు సాధ్యమనే సందేశాన్ని కాంక్లేవ్ ద్వారా ప్రతిధ్వనింపజేసింది. పరస్పర సహకారం, విశ్వాసం, నెట్‌వర్కింగ్ ద్వారా వ్యాపారాలను మరింత విస్తరించుకోవచ్చని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి హాజరైన ప్రతినిధులు పరస్పర పరిచయాలు పెంపొందించుకొని భవిష్యత్ భాగస్వామ్యాలకు బాటలు వేశారు.

**వ్యాపార భవిష్యత్తుపై ఏఐ మార్గనిర్దేశం**

ప్రస్తుత డిజిటల్ యుగంలో కృత్రిమ మేధ (ఏఐ) వ్యాపార రంగాన్ని ఎలా ప్రభావితం చేస్తోందనే అంశంపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ప్రముఖ ఏఐ ట్రైనర్ రఘువీర్ మాట్లాడుతూ, వ్యాపారాభివృద్ధిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, డిజిటల్ మార్కెటింగ్,

-మిగతా 2లో

### బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు

# ధన్యవాదాలు

మొదటి తరువాయి

తాను చేసిన పలు సూచనలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. తన పిలుపులకు కేవలం మద్దతు ఇవ్వడమే కాకుండా, వాటిని ఆచరణలో పెట్టడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రజలను బంగారం కొనుగోళ్లు తగ్గించాలని, ఇంధన వినియోగాన్ని నియంత్రించాలని చేసిన విజ్ఞప్తులకు దేశ ప్రజలు సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్‌పూలింగ్, ఇంధన పొదుపు, విదేశీ ప్రయాణాల తగ్గింపు వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణానికి మేలు చేస్తున్నాయన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఇచ్చిన సూచనలకు ప్రజలు సహకరించడం దేశ ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే దేశం ఇలాంటి సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనగలదని ప్రధాని మోడీ అన్నారు. దేశ భద్రత స్వయం సమృద్ధి దిశగా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

2026 తొలి ఆరు నెలలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో... ఈ కాలంలో భారత్ అనేక రంగాల్లో గొప్ప విజయాలు సాధించిందని గుర్తు చేశారు. ముఖ్యంగా రక్షణ రంగంలో వచ్చిన పురోగతి దేశ ప్రజలందరికీ గర్వకారణమని ఆయన వివరించారు. స్వదేశీ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికత, బలమైన రక్షణ వ్యవస్థలతో భారత్ త్వరితగతిన ఆత్మనిర్భరత వైపు దూసుకుపోతోందని స్పష్టం చేశారు. ఇక ఇటీవల జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా 2,500కు పైగా ప్రదేశాల్లో వివిధ యోగా కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. నలంద విశ్వవిద్యాలయం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రధాని ప్రశంసించారు.

# పాకిస్థాన్ సైన్యంపై ఉగ్రదాడి..

**-నలుగురు జవాన్‌లు మృతి..**
**-సైన్యం దాడిలో ఆరుగురు ఉగ్రవాదులు హతం..!**
**-కరాచీలోని సింధ్ రేంజర్ల స్థావరంపై భీకర ఉగ్రదాడి**
**- పేలుడు పదార్థాల వాహనంతో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు**
**- దాడికి బాధ్యత వహించిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రసంస్థ**



న్యూఢిల్లీ,
పాకిస్థాన్‌లోని కరాచీ నగరంలో భీకర ఉగ్రదాడి జరిగింది. నగరంలోని సింధ్ రేంజర్ల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడి, కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, మరొకరిని సజీవంగా పట్టుకున్నారు. కరాచీలోని గులిస్తాన్ ఎజాహర్ ప్రాంతంలో ఉన్న సింధ్ రేంజర్ల ప్రధాన కార్యాలయంపై ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దూసుకోచ్చారు. స్థావరాన్ని ఢీకొట్టి వాహనాన్ని పేల్చేవేసిన వెంటనే, మిగిలిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెంటనే ఎదురుదాడికి దిగడంతో ఆ ప్రాంతం మొత్తం కాల్పుల మోతతో దద్దరిల్లింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక పోలీసు బలగాలు, కమాండోలను రంగంలోకి దించారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపి) నుంచి విడిపోయిన 'జమాత్-ఉల్-అహ్రార్' అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. పాకిస్థాన్‌లో భద్రతా బలగాలపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిపై సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీ షా తీవ్రంగా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ ఘటనలో సామాన్య పౌరులెవరూ గాయపడలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.

# మళ్లీ యుద్ధమేఘాలు!

**- నౌకలపై ఇరాన్ దాడికి అమెరికా ప్రతిదాడులు**
**- ప్రతీకారంగా కువైట్, బహ్రెయిన్‌లపై ఐఆర్‌జీసీ ఎటాక్**
**- ఇరాన్ ఆనవాళ్లు కూడా ఉండవని ట్రంప్ వార్నింగ్**



౯, నేషనల్ బ్యూరో:
పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఇటీవల తాత్కాలిక కాల్పుల ఒప్పందం జరిగినప్పటికీ.. మళ్లీ పరిస్థితులు మొదటికే వచ్చేలా కనిపిస్తున్నాయి. ఇరాన్ ఓ నౌకపై దాడి చేసి కాల్పుల విరమణను ఉల్లంఘించిందని ఆరోపిస్తూ అమెరికా భీకర దాడులు చేసింది. దీనికి ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కూడా గట్టిగానే బదులు ఇచ్చింది. కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు దిగింది. అమెరికా ఇంకా తన దాడులను కొనసాగిస్తే యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చలు పూర్తిగా నిలిచిపోతాయి అని ఇరాన్ హెచ్చరించింది.

**చమురు ట్యాంకర్ పై దాడి చేసినందుకే..**
ఖతార్ నుంచి బయలుదేరి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నౌకాశ్రయానికి హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న ఓ అంతర్జాతీయ నౌకపై గత శనివారం తెల్లవారుజామున ఇరాన్ డ్రోన్లతో దాడి చేసింది. ఈ దాడితో ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ఆగ్రహించగా.. అమెరికా ప్రతిగా దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో దాడులకు దిగింది. ఇందులో సిరిక్, బందర్-ఏ లెంఘా. కేశ్ ఐలాండ్‌లోని ఇరాన్ స్థావరాలపై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. అలాగే కేశ్ దీవుల్లో ఉన్న ఇరాన్ నిఘా వ్యవస్థలు, క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు, కోస్టల్ రాడార్ సైట్లపై దాడులు చేసింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని గౌరవించే అవకాశం ఇరాన్‌కు లభించిందని, కానీ కీడు నౌకపై దాడి చేసి ఆ దేశం దానిని వదులుకుందని అమెరికా సైన్యం తెలిపింది.

**ఇరాన్ ఎదురుదాడులు..**
అమెరికా చేసిన దాడులకు ప్రతీకారంగా ఐఆర్‌జీసీ ఎదురుదాడులకు దిగింది. బహ్రెయిన్, కువైట్‌లో ఉన్న అమెరికా స్థావరాలపై దాడులు చేసింది. బహ్రెయిన్‌లోని అమెరికా నేవీకి చెందిన 5వ ఫ్లీట్ బేస్‌ను టార్గెట్ చేసుకొని క్షిపణి దాడి చేసింది. దీంతో ఆ దేశవ్యాప్తంగా సైరన్లు మోగాయి. ఓ క్షిపణి రాజధాని మనామాలోని ఒక నివాస భవనాన్ని తాకడంతో కొంత ధ్వంసం అయ్యింది. అలాగే కువైట్‌లోని అమెరికా మెయిన్ ఆర్మీ బేస్ అయిన అలీ అల్-సలేంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే కువైట్ ఎయిర్ డిఫెన్స్ వాటిని గాలిలోనే పేల్చేశాయి.

**ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్**
ఇరాన్ దాడులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ పదే పదే ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇక తాము శాంతియుతంగా ఉండలేమని అసహనం వ్యక్తం చేశారు. తాము సైనిక పరంగా మొదలుపెట్టిన పనిని పూర్తి చేయాల్సి వస్తుందని అన్నారు. అదే జరిగితే ఇక ఇరాన్ ఉనికే ఉండదని, దాని ఆనవాళ్లు భూమిపై కనిపించవని సీరియస్‌గా హెచ్చరించారు.

# కూన కుమ్మేసింది

**-రెండో టీ20లో 1 పరుగు తేడాతో గెలుపు**
**-2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఐర్లాండ్**
**-తిలక్ వర్మ అర్ధశతకం వృథా..**
**-టీ20ల్లో తొలిసారి భారత్‌పై సిరీస్ విజయం**

**ఐర్లాండ్ చరిత్ర సృష్టించగా, ప్రపంచ చాంపియన్‌కు దారుణ భంగపాటు. పేస్, బౌన్స్‌కు అనుకూలించిన పిచ్‌పై వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన టీమ్ ఇండియా టీ20 సిరీస్‌ను 0-2తో ఐర్లాండ్‌కు కోల్పోయింది. దీంతో పొట్టి ఫార్మాట్‌లో వరుసగా 12 సిరీస్ విజయాలు సాధించిన భారత్ జైత్రయాత్రకు పసికూన ఐర్లాండ్ బ్రేక్ వేసింది. ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేయగా, హ్యారీ టెక్టర్ (53) అర్ధ సెంచరీతో రాణించాడు. ఛేదనలో తిలక్ వర్మ (55) అర్ధ సెంచరీతో పోరాడినా భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులే చేసింది. ఒక్క పరుగు తేడాతో ఐర్లాండ్ చేతిలో భారత్ ఓటమి పాలైంది. ఐర్లాండ్ చేతిలో భారత్‌కు ఇది తొలి సిరీస్ ఓటమి.**



బెల్‌ఫాస్ట్
ఐర్లాండ్ అద్భుతం చేసింది. టీ20 ప్రపంచ చాంపియన్ టీమ్ ఇండియాపై చారిత్రక సిరీస్ విజయం సాధించింది. మూడు రోజుల వ్యవధిలో భారత్‌పై రెండు సార్లు విజయం సాధించిన ఐర్లాండ్ 2-0తో టీ20 సిరీస్‌ను ఏకంగా క్లీన్‌స్వీప్ చేసింది. ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలోనే ఆ జట్టుకు ఇదే అతిపెద్ద విజయం. ఆదివారం బెల్‌ఫాస్ట్‌లో జరిగిన రెండో టీ20లో ఆతిథ్య ఐర్లాండ్ 1 పరుగుల తేడాతో గెలుపొందింది. 155 పరుగుల ఛేదనలో భారత్ చతికిల పడింది. వైస్ కెప్టెన్ తిలక్ వర్మ (55, 46 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో పోరాడిన ఫలితం లేకపోయింది. ఓపెనర్లు సంజు శాంసన్ (0), అభిషేక్ శర్మ (0) సున్నా పరుగులకే అవుటవగా.. ఇషాన్ కిషన్ (12), శ్రేయస్ అయ్యర్ (10) బాధ్యతగా ఆడటంలో విఫలం అయ్యారు. తిలక్ వర్మ ఓ ఎండ్‌లో నిలబడినా.. అక్షర్ పటేల్ (14), శివం దూబె (20), సూర్యాన్ష షెడ్జె (1) ఆశించిన సహకారం అందించలేదు. ఆఖర్లో హర్షిత్ రానా (21), ప్రిన్స్ యాదవ్ (6 నాటౌట్) పోరాడినా భారత్‌కు భంగపాటు తప్పలేదు. పవర్‌ప్లే, మిడిల్ ఓవర్లలో భారత్‌పై పైచేయి సాధించిన ఐర్లాండ్.. అద్వితీయ విజయంతో స్వదేశంలో క్రికెట్ అభిమానుల సంబురాలకు తెరతీసింది.

**రాణించిన టెక్టర్**
వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలు ఓపెనర్లను అవుట్ చేసి బ్రేక్ అందించినా.. ఆతిథ్య ఐర్లాండ్ పవర్‌ప్లేలో 44 పరుగులు చేసింది. టిమ్ టెక్టర్ (5), రాస్ అడైర్ (16)లు ఎదురుదాడికి ప్రయత్నించినా వికెట్లు నిలుపుకోలేదు. హ్యారీ టెక్టర్ (53), కెప్టెన్ లోర్కాన్ టకర్ (15)తో కలిసి 27 పరుగులు జోడించాడు. టకర్‌ను ప్రిన్స్ యాదవ్ సాగనంపినా.. బెన్ కాలిట్జ్ (37) జతగా టెక్టర్ జోరందుకున్నాడు. ఈ ఇద్దరూ నాల్గో వికెట్‌కు 44 బంతుల్లోనే 65 పరుగులు చేశారు. వర్షంతో ఇన్నింగ్స్‌కు అంతరాయం కలిగినా.. టెక్టర్ జోరు తగ్గలేదు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 44 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన టెక్టర్.. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై ఐర్లాండ్‌కు మంచి స్కోరు అందించాడు. ఆఖర్లో జార్జ్ డాక్‌రెల్ (19) సైతం రాణించాడు. దీంతో 20 ఓవర్లలో 8 వికెట్లకు ఐర్లాండ్ 154 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ (3/22), శిం దూబె (2/25), అర్ష్‌దీప్ సింగ్ (2/35) రాణించారు.

# అన్నదాతలకు అండగా 'ప్రజా ప్రభుత్వం'

మొదటి తరువాయి

**వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో పైసలు**
అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాల సూచనలు ఉన్నప్పటికీ, ఏ విపత్తు ఎదురైనా ఈ సభ అనుకున్న దానికంటే డబుల్, ట్రిబుల్ సక్సెస్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లుగా ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను అక్షరాలా నిలబెట్టుకుంటూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో క్యాబినెట్ సాహసోపేత నిర్ణయం తీసుకుని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మానవీయ కోణంలో కొనుగోలు చేసినదని గుర్తుచేశారు. కేవలం కొద్దిరోజుల కొద్దిగా, కొన్న వారం రోజుల లోపులే రైతుల అకౌంట్లో పైసలు వేసిన నిఖార్సైన రైతు పక్షపాత ప్రభుత్వం ఇది అని కొనియాడారు.

**రైతు ద్రోహులే నేడు కపట ప్రేమకు ముసుగు!**
గత పదేళ్ల పాలకుల తీరుపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కేంద్ర, రాష్ట్రాల్లో గతంలో అధికారంలో ఉన్నవాళ్లు నేడు ఈ ప్రభుత్వంపై అనవసరంగా అలవాటు, చవకలు వేతుతున్నారని మండిపడ్డారు. ప్రజలు తమ వైపు చూడటం లేదని క్షేత్రస్థాయిలోనే వాళ్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. "ఇదే ఖమ్మం పట్టణంలో గతంలో వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు, రైతుల కష్టాలు పట్టించుకోకుండా, నడిరోడ్డుపై అన్నదాతలకు సంకెళ్లు వేసి జైలుకు పంపించిన దుర్మార్గాన్ని ఈ జిల్లా ప్రజలు ఎప్పటికీ మరవరు. నాటు రైతులను ఎప్పటికి, హింసించిన వాళ్లే.. నేడు ముసలి కన్నీరు కారుస్తూ కపట ప్రేమ ఒలకపోస్తున్నారు. ఈ రాజకీయ డ్రామాలను రైతులందరూ గమనిస్తూనే ఉన్నారు" అని హెచ్చరించారు. జిల్లా సీనియర్ నేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేలందరినీ కలుపుకుని ఈ సభను ఒక చారిత్రాత్మక విజయంగా మలుస్తామన్నారు.

# ఎస్ఎల్ బీసీ- డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

మొదటి తరువాయి

తర్వాత నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన 'ప్రజాపాలన--ప్రగతిపాలన' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మూసీ నది ప్రక్షాళనను తన జీవిత లక్ష్యంగా తీసుకొని అమలు చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ భవిష్యత్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో నల్లగొండ జిల్లా త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. తొలి ఉద్యమంలో మంత్రి పదవిని త్యజించిన కొండా లక్ష్మణ్ బాపూజీ, మలి ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ఆమరణ నిరాహార దీక్ష చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి సేవలను కొనియాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య తదితర అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం
కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పుడైనా ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమని సీఎం ప్రకటించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన, బీజేపీ కేంద్ర పాలన, కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలన, ఎన్నికల హామీల అమలుపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్, బీజేపీకి సవాల్ విసిరారు. గత ప్రభుత్వాలు ఇవ్వని లక్షలాది కొత్త రేషన్ కార్డులను తమ ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. సంవత్సరానికి రూ.16 వేల కోట్ల వ్యయంతో 3.28 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టామని, ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు పేద కుటుంబాలకు మేలు చేస్తున్నాయని అన్నారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. రూ.69 వేల కోట్ల అప్పుతో ఉన్న రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పుల్లోకి నెట్టారన్నారు. కట్టిన మూడు సంవత్సరాల్లోనే కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడం గత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉద్యమ త్యాగాల పేరుతో కుటుంబ పాలనకు శ్రీకారం చుట్టి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు, అందుకే ప్రజలు వారిని తిరస్కరించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు.

రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు
రైతు రుణమాఫీ, రైతు భరోసా, పెట్టుబడి సాయం, బోనస్, వరి కొనుగోళ్లతో రైతులకు అండగా నిలిచామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 30 నెలల్లో రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు. దేశంలో అత్యధిక వరి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలవగా, అందులో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యతో పాటు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ గురుకులాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని అన్నారు. ?

# వైశ్య వ్యాపార శక్తికి ప్రతీకగా వీ వైశ్య గ్లోబల్ కాంక్లేవ్

మొదటి తరువాయి

కస్టమర్ రిలేషన్ మేనేజ్‌మెంట్, ఆటోమేషన్, డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతపై సమగ్రంగా వివరించారు. భవిష్యత్ వ్యాపార పోటీలో నిలదొక్కుకోవాలంటే ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడం అనివార్యమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు ఏఐ సాధనాలను వినియోగించడం ద్వారా తమ ఉత్పాదకతను, లాభదాయకతను పెంచుకోవచ్చని సూచించారు. ఆయన ప్రదర్శన ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకుంది.

**ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి**
వ్యాపారాభివృద్ధితో పాటు ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమనే ఉద్దేశంతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సు ఆకట్టుకుంది. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ సోమనాథ్ గుప్తా మాట్లాడుతూ, వ్యాపారవేత్తలు ఆర్థికాభివృద్ధితో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. క్రమబద్ధమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, సమయపాలన విజయవంతమైన జీవితానికి పునాదులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎక్స్‌పాన్షన్స్ లీడ్ సోలార్ వాలా రాజేష్, హైదరాబాద్ కౌండిన్య గ్రూప్ కార్యదర్శి ప్రశాంత్ కుమార్, గ్లోబల్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ సంతోష్ శెట్టి, పాస్ట్ గ్లోబల్ ప్రెసిడెంట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 250 మందికి పైగా ప్రతినిధులు, దుబాయ్ కి చెందిన ప్రవాస భారతీయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వైశ్య వ్యాపారవేత్తల మధ్య బలమైన అనుసంధానం, కొత్త అవకాశాల సృష్టి, పరస్పర సహకారానికి ఈ కాంక్లేవ్ ఒక మైలురాయిగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచే సమగ్ర వ్యాపార నెట్‌వర్క్ నిర్మాణమే తమ లక్ష్యమని, దేశవ్యాప్తంగా మరింత మంది వ్యాపారవేత్తలను ఈ వేదిక ద్వారా అనుసంధానించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.



# పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

- ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇందిరమ్మ
- ఇంటి స్లాబ్ పనులకు శ్రీకారం



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్)**
తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా పుల్జాల శివలీల–బాల్ చెన్నయ్య దంపతుల ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులను ఆదివారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోయ నరసింహ, పుల్జాల విష్ణు, హినా బేగం, అరీఫ్, తిరుమణి కృష్ణవేణి, కృష్ణయ్య గౌడ్ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఇళ్లు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం. అంబాజీ, అంజయ్య గౌడ్, నాయకులు తిరుమణి కృష్ణయ్య గౌడ్, లకుమల్ల మల్లేష్, రాజు, వెంకటయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు సేవలో విశిష్ట సేవలు అందించిన కిచ్య నాయక్‌కు ఘన సత్కారం



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ జూనియర్ సూపర్‌వైజర్‌గా సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన కిచ్య నాయక్‌ను ఆదివారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నరసింహ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి ఉద్యోగ జీవితంలో రైతులకు, వ్యవసాయ మార్కెట్ యార్డుకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. చైర్‌పర్సన్ యాట గీత నరసింహ మాట్లాడుతూ కిచ్య నాయక్ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తూ రైతుల విశ్వాసాన్ని చూరగొన్నారని, ఆయన అందించిన సేవలు మార్కెట్ యార్డు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు వస్పుల శ్రీశైలం, అంజయ్య గుప్తా, తాళ్ల రవీందర్, జెల్ల రమేష్, పల్లె జంగయ్య గౌడ్, యాదయ్య, పాండు రంగయ్య, శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొని కిచ్య నాయక్‌కు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

# మార్కెట్ యార్డు అభివృద్ధికి మరో అడుగు



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆదివారం చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు భాగంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల అంచనా వ్యయంతో రూపొందించిన ఎస్టిమేట్‌ను రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) సమర్పించారు. ఈ ఎస్టిమేట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అలాగే సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. ఈ రోడ్డు నిర్మాణంతో మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు, వ్యాపారులు, వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు యార్డు అభివృద్ధికి దోహదపడుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు వస్పుల శ్రీశైలం, అంజయ్య గుప్తా, తాళ్ల రవీందర్, జెల్ల రమేష్, పల్లె జంగయ్య గౌడ్, యాదయ్య, పాండు రంగయ్య, శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి ద్యాప గోపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం – సుంకిరెడ్డి



**కల్వకుర్తి, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం విశేష కృషి చేసిన దివంగత నేత ద్యాప గోపాల్ రెడ్డి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తి మండల ప్రజా పరిషత్ ఆవరణలో జరిగిన 100వ శతజయంతి ఉత్సవాలలో ఆయన పాల్గొని, గోపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవలందిస్తూ, కల్వకుర్తి ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సైక్లింగ్ పోటీలు యువతలో ఆరోగ్య స్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా క్రీడాస్ఫూర్తిని పెంచుతాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో గోలి ప్రభాకర్ రెడ్డి, నర్సిరెడ్డి (వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు), చిత్తరంజన్ దాస్ (శృతిలయ కల్చర్ అకాడమీ చైర్మన్), సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, నిర్వాహకులు సందీప్, ప్రశాంత్ రెడ్డి, అభిమానులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కలకు చేయూతగా ఉప్పల వెంకటేష్



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు మూర్తుజపల్లి, 4వ వార్డు జంగారెడ్డిపల్లికి చెందిన నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునేందుకు రాష్ట్ర నాయకులు, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల వెంకటేష్ అన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ఆధ్వర్యంలో సిమెంట్ అందజేశారు. కాలె నరసింహ, కొడారి శివలింగం, ఎం.డి. మున్ని, బౌరమ్మ కుటుంబాలకు ఇంటి నిర్మాణ ఫినిషింగ్ పనుల కోసం సిమెంట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని, అవసరమైన వారికి భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. సాయం అందుకున్న కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు కాలె యశోదమ్మ, దుడ్డు ఆంజనేయులు యాదవ్, తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, కాలె విక్రమ్, వరికుప్పల బాబు, గండికోట వీరేష్, ఉప్పల రామచంద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి..

- పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్య నాయక్



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్య నాయక్ ప్రారంభించారు. చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్, వైద్యురాలు డాక్టర్ మైమునా బేగం, హెచ్ఈఓ వెంకటేశ్వరరెడ్డి, పీహెచ్ఎన్ కృపమ్మ, సూపర్‌వైజర్ గుజ్జరి శ్రీనివాస్, నాయకులు గుండ్రాతి కుమార్ గౌడ్, సురేష్ నాయక్, గుద్దేటి శివ, ఆశా వర్కర్ చంద్రకళ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పోలియో రహిత సమాజమే లక్ష్యం

- కౌన్సిలర్ అనూష శ్రీశైలం

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కౌన్సిలర్ పుల్లారెడ్డి అనూష శ్రీశైలం పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారుల సేవలు యువ పోలీసులకు స్ఫూర్తిదాయకం

- ఏసీపీ జానకిరెడ్డి



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ బి. సీతారాం రెడ్డి, అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్. మురళీధర్ రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న సందర్భంగా ఆదివారం పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్లో ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మహేశ్వరం ఏసీపీ జానకిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ పొందుతున్న అధికారుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు శాఖలో వారు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు, శాఖకు విశిష్ట సేవలు అందించారని, వారి సేవలు యువ పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. అనంతరం వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్ రెడ్డి, కందుకూర్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, కడ్తాల్ ఎస్‌హెచ్‌ఓ సాయిరెడ్డి, తలకొండపల్లి ఎస్‌హెచ్‌ఓ జానకిరెడ్డి, ఎస్‌ఐలు కోటేశ్వరరావు, వెంకటేష్, వరప్రసాద్, ఏఎస్ఐ రామ్‌రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, పదవీ విరమణ పొందుతున్న అధికారుల కుటుంబ సభ్యులు, పలువురు ఆహ్వానితులు పాల్గొని వారికి ఘనంగా వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# నిండు జీవితానికి రెండు చుక్కలు



పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ దెంది రాంరెడ్డి

**యాచారం, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తమ్మలోనిగూడ గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ దెంది రాంరెడ్డి, ఉపసర్పంచ్ కాలే శ్రీశైలం కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రి తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. గతంలో వేసినా, ఈ విడతలో కూడా తప్పనిసరిగా వేయించాలి" అని విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## - పీర్జాదిగూడలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హైదరాబాద్**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామల శ్రీనివాస్, వెంకట్, పన్నాభాయ్, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఆశా వర్కర్ షాకిరా తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**షాద్ నగర్, జూన్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షాద్‌నగర్ పట్టణంలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం భాగంగా బస్ స్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చిన్నారులకు పోలియో చుక్కలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారి పోలియో నిరోధక టీకా తప్పనిసరిగా పొందేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పెంటయ్య, మురళీమోహన్ అప్పి, సంతోషి భాయి, చందులాల్, కొప్పునూరి ప్రవీణ్, రాజు నాయక్, బచ్చలి నరేష్, శివ ఎస్పీ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, సుజీవన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, మాజీ జడ్పీటీసీ వెంకటరాం రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, ఉప్పరిగడ్డ గ్రామ సర్పంచ్ చందు నాయక్, నాగమణి, తంగడపల్లి శంకర్, మంగ అశోక్, జయప్రకాశ్, రవితేజ, నీరటి వాసు, షఫీద్దిన్, హెల్త్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**వంగూరు,జూన్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వంగూరు మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామపంచాయతీ వంగూరు గేట్ వద్ద పల్స్ పోలియో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి చిన్నారి ఆరోగ్య రక్షణ కోసం తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, నాయకులు బాధమోని రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, మల్లేష్ యాదవ్, సైదులు, కృష్ణ, సయ్యద్ హమీద్, జనార్ధన్, ఎస్.కె గఫూర్, జంగయ్య, భాస్కర్, ఆనంద్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి



**మొయినాబాద్, జూన్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 0--5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని 185 కేంద్రాల్లో 8,210 మంది సిబ్బంది సమిష్టిగా పనిచేస్తూ 4 లక్షల 21 వేల మంది పిల్లలకు పోలియో చుక్కలు అందజేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి చిన్నారి ఆరోగ్య రక్షణలో బాధ్యతగా వ్యవహరించాలని, పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎండహేచ్ఓ స్వర్ణకుమారీ, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీం భరత్, మాజీ జెడ్పిటిసి కాలే శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మున్సిపల్ చైర్‌పర్సన్ షాబాద్ సోనియా దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో పల్స్ పోలియో కార్యక్రమం



**నందికొట్కూరు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్లూరు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి పాల్గొని 0--5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పిల్లల నిండు జీవితానికి రెండు పల్స్ పోలియో చుక్కలు రక్షణ కవచంలా నిలుస్తాయి. ఒక్క చిన్నారి కూడా మిగలకుండా ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి" అని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సున్నంపల్లి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలే సమాజ ప్రగతికి బలమైన పునాదులు

**- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా గ్రామాల అభివృద్ధికి బలమైన పునాదులు పడతాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ (రూరాఖ) సీఓఓ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, యువతతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా విధానం, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులు, యువతకు మార్గదర్శకత్వం వహించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొంటూ, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థుల విజయం వారి పట్టుదల, కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని, అవసరమైన మౌలిక వసతులు, విద్యా సామగ్రి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు ముగ్గురు విద్యా వాలంటీర్లను అందించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకరిస్తున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజీవ్, వార్డు సభ్యులు పుష్పలత చంద్రశేఖర్, రమేష్, జంగయ్య, తిరుపతయ్య, సాయికుమార్, విజయ, శ్రీశైలం, కృష్ణమ్మ, మాజీ ఉప సర్పంచ్ సింధుజ మల్లేష్, మాజీ వార్డు సభ్యుడు కొండల్ యాదవ్, గ్రామ పెద్దలు పెద్దయ్య, ఒగ్గు వెంకటయ్య, లోడిగ తిరుపతయ్య, బాలరాజ్, దొబ్బల బాలయ్య, బాబురావు, మోహన్, లోడిగ శ్రీశైలం, యువ నాయకులు భరత్, శివ, పెరుమళ్ల శ్రీశైలం, ఒగ్గు కొండల్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలియో రహిత తెలంగాణకు.. ప్రతి చిన్నారి భాగస్వామి కావాలి..

**- విటాయిపల్లిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పోలియో రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విటాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని, పోలియో నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని సూచించారు. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పోలియోను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరగా, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో బాధ్యతాయుతంగా పాల్గొనాలని అన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, ఏఎంసీ చైర్మన్ గీత నరసింహ, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ మైమున, వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, సీఎచ్‌వో విజయ, పీహెచ్‌ఎన్ కృపమ్మ, హెచ్ఈఓ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, స్థానిక నాయకులు శ్రీధర్ నాయక్, ఫరీద్, సురేష్, శివ, రవి ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజానికి సర్పంచ్ గోపాల్ పిలుపు



**కడ్తాల్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పోలియో రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ 0--5 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమం దేశ ఆరోగ్యరంగంలో అత్యంత కీలకమని, ప్రతి చిన్నారి ఆరోగ్య రక్షణలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## చిన్నారుల ఆరోగ్య రక్షణకు పోలియో చుక్కలు తప్పనిసరి

**-చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి**



**ఫరూక్‌నగర్ , జూన్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** చిలకమర్రి గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నారులు పోలియో బారిన పడకుండా కాపాడటంలో ఈ రెండు చుక్కల మందు ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, గ్రామంలో ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ శాఖల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు : సర్పంచ్ రెంటాల కృష్ణ



**కురవి , జూన్ 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అవసరం అని సర్పంచ్ రెంటాల కృష్ణ అన్నారు. కురవి మండలం నల్లెల్ల పోలియో దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రం లో సర్పంచ్ రెంటాల కృష్ణ ఉప సర్పంచ్ నిమ్మల గంటి కృష్ణమూర్తి తో కలిసి పల్స్ పోలియో కార్యక్రమమని ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సంద్భంగా మాట్లాడుతూ... ఐదేళ్ల లోపు చిన్నారుల కు పోలియో చుక్కలు వేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కటాక్షి , ఆశా వర్కర్లు బండారి ఉమా విజయ , కారోబార్ నిమ్మలగంటి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం



**మర్రిగూడ, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మర్రిగూడ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శాలిని సర్పంచ్ వీరమల్ల శిరీష, లోకేష్ గౌడ్ తో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 39 పల్స్ పోలియో కేంద్రాలు, ఒక మొబైల్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి రెగ్యులర్ టీకాలతో సంబంధం లేకుండా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు.కార్యక్రమంలో డాక్టర్ దీపక్, ఉపసర్పంచ్ మహేశ్వరం రమేష్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రతపై ఆందోళన

**దేవరకొండ, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రతను తగ్గించడం ఆందోళన కలిగించే విషయమని బీఆర్ఎస్ యువజన నాయకుడు షేక్ ఇస్మాయిల్ పేర్కొన్నారు.ప్రవీణ్‌కుమార్ 26 సంవత్సరాల పాటు ఐపీఎస్ అధికారిగా సేవలందించడమే కాకుండా, గురుకుల విద్యాసంస్థల ద్వారా వేలాది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని ఆయన గుర్తుచేశారు. గతంలో ప్రాణహాని ఉందని వెల్లడించిన నేపథ్యంలో భద్రతను తగ్గించడం సముచితం కాదని, ప్రభుత్వం వెంటనే పునఃసమీక్షించి తగిన భద్రతను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



**దేవరకొండ, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



"నిండు జీవితానికి రెండు చుక్కలు" నినాదంతో దేవరకొండ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని పల్లె ధావఖాన వద్ద మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఉలుపాల శేఖర్ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారి ఆరోగ్య రక్షణ కోసం తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు ఎన్.వి.టి, 10వ వార్డు కౌన్సిలర్ మాధవి సత్యం సభ్యులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూట పదిమంది వరకు చిన్నారులకు పోలియో చుక్కలు అందజేయడం జరిగింది.ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, క్రీడాకారులు, ఆశా వర్కర్లు పాల్గొనడంతో కార్యక్రమాలు విజయవంతంగా సాగాయి.

## కొండూరు గోవర్ధన్‌కు సన్మానం

**కల్వకుర్తి, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులైన కల్వకుర్తి మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లో శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవర్ధన్ ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారని, ఈ గుర్తింపు రావడం హర్షనీయమని అన్నారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, జిల్లా నాయకుడు నాగుల్ నాయక్, మాజీ సర్పంచులు కృష్ణారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాష్, నాయకులు రామచంద్రయ్య, శివప్రసాద్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**దేవరకొండ, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

దేవరకొండ పట్టణంలోని 11, 12వ వార్డుల్లో రూ.1.42 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను అందించడం లక్ష్యమని తెలిపారు.రూ.1.42 కోట్లతో నిర్మించనున్న ఈ రోడ్లు పూర్తయిన తర్వాత ఆయా వార్డుల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు ఘన సన్మానం



**ఆమనగల్లు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్ఇన్‌స్పెక్టర్ బి. సీతారాం రెడ్డి, అసిస్టెంట్ సబ్ఇన్‌స్పెక్టర్ ఎస్. మురళీధర్ రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న సందర్భంగా ఆదివారం పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఎస్‌హెచ్ఓ ఎస్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము హాజరై పదవీ విరమణ పొందుతున్న అధికారులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీతారాం రెడ్డి, మురళీధర్ రెడ్డి తమ సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజాసేవా దృక్పథంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముక్తాల వెంకటయ్య, అనిత శ్రీనివాస్ రెడ్డి, పోలీసు సిబ్బంది, రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, రాకేష్ తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న అధికారులకు ఘనంగా వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# ముందస్తు అరెస్టులపై తీవ్ర ఆందోళన









**దేవరకొండ, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులపై పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టడం వివాదాస్పదమైంది.చింతపల్లి మండల బిఆర్ఎస్వీ అధ్యక్షుడు ఆరెకంటి మురళిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అణచివేయడానికి ముందస్తు అరెస్టులు ఉపయోగపడవని, నిరుద్యోగ హామీలు, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు, ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ విడుదల వంటి అంశాలపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు.అదేవిధంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి కళాచారిని గుడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణచివేయలేమని, విద్యారంగంలో అధ్యాపకుల





కొరత, ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలు వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, విద్యార్థుల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్న పరిస్థితిని ఎత్తిచూపుతూ, విద్యార్థుల సమస్యలపై స్పందించకుండా ఉద్యమకారులపై కేసులు పెట్టడం అన్యాయం అని అన్నారు.ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ కూడా ముందస్తు అరెస్టులను ఖండిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న నాయకుల గొంతు నొక్కడం సరికాదని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఆర్మూర్‌లో ఉర్దూ ఉపాధ్యాయుడిపై దాడి ఖండన


**నల్లగొండ, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**





ఆర్మూర్‌లో ఉర్దూ ఉపాధ్యాయుడిపై జరిగిన దాడిని జమీయత్ ఉలమా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షా సయ్యద్ ఎహ్సానుద్దీన్ రషాదీ ఖాసిమీ తీవ్రంగా ఖండించారు.నిందితులతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సంఘటన సమయంలో నిర్లక్ష్యం వహించిన పోలీసులను సస్పెండ్ చేసి, నిష్పాక్షిక విచారణ జరపాలని ఆయన కోరారు. మత విద్వేష ఘటనలను అరికట్టడంలో ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు లేకుంటే ప్రజల్లో ఆందోళన పెరుగుతుందని హెచ్చరించారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన చెవ్వ ప్రమోద్



**నాగర్‌కర్నూల్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు, పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్, పట్టణ ప్రధాన కార్యదర్శి వారధి శ్రీను పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చెవ్వ ప్రమోద్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పుల్ల మౌని పర్వతాలు, డాక్టర్ సాయిశ్రీ, వనజ, సుజాత, మహేశ్వరి, యాదమ్మతో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వెల్దండలో పల్స్ పోలియో కార్యక్రమాలు





**వెల్దండ, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి.బైరాపూర్ గ్రామంలో పల్లె దావఖాన వద్ద గ్రామ సర్పంచ్ మంజుల రాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి పవన్ నాయక్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ చంద్రకళ, అంగన్వాడీ వర్కర్ అచ్చమ్మ పాల్గొన్నారు.మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పోలియో చుక్కలు చిన్నారులకు జీవితాంతం రక్షణ కవచంలా నిలుస్తాయని, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రి భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు, వార్డు సభ్యులు పసునోజు వాణి పురుషోత్తం, గుద్దటీ కిష్టల్, మారేపల్లి మంజుల శ్రీను, మసిగుండ్ల వెంకటేష్, నాయకులు తుంగ శ్రీను, రాజు, వెంకటయ్య, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ద్యాప గోపాల్ రెడ్డికి నివాళులు అర్పించిన గోలి శ్రీనివాస్ రెడ్డి.



**కల్వకుర్తి, జూన్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే మాజీ సమితి అధ్యక్షుడు డిసిసిపి చైర్మన్ గా పనిచేసిన దివంగనేత ధ్యాప గోపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలో గోపాల్ రెడ్డి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా పెట్రోల్--డీజిల్ తగ్గించరా..?




**కల్వకుర్తి, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శించారు.అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 120 డాలర్ల నుండి 72 డాలర్లకు పడిపోయినా, పెట్రోల్--డీజిల్--గ్యాస్ ధరలు తగ్గించడం లేదని ఆయన ఆరోపించారు. ఆయిల్ కంపెనీలతో కుమ్మక్కై ప్రజలపై భారాలు మోపుతున్నారని, వెంటనే ధరలు తగ్గించి రవాణా ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు బి. ఆంజనేయులు, చింతా ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, చెన్నయ్య, బక్కయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## 53వ డివిజన్‌లో లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మేయర్

**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని 53వ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ శ్వేత రమన్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. మంచిర్యాల చౌరస్తా--శర్మనగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతున్న సమస్యను స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.మురుగు కాలువల పూడికతీత పనులు వేగంగా కొనసాగుతున్నాయని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.25 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు మేయర్ తెలిపారు.ప్రజలు మురుగు కాలువల్లో ప్లాస్టిక్, చెత్త వేయకుండా, ఇంటింటి చెత్తను స్వచ్ఛ ఆటోలు ద్వారా మాత్రమే అందించాలని సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పల్స్ పోలియో కార్యక్రమాలు విజయవంతం





**కల్వకుర్తి, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఐదేళ్లలోపు చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం కల్వకుర్తి పురపాలక సంఘం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.బస్టాండ్ పాత గ్రామపంచాయతీ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోరేటి శ్రీనివాస్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.ఎనిమిదవ వార్డులో అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ కోడెల లలిత గణేష్ యాదవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ "నిండు జీవితానికి రెండు చుక్కలు" అని, పోలియో నిర్మూలనలో ప్రతి కుటుంబం సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అలివేల, కాంగ్రెస్ మహిళా నాయకురాలు రిహానా బేగం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీజేపీ శ్రేణులకు సునీల్ రావు దిశానిర్దేశం



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటరు జాబితా రూపకల్పన కోసం బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండి పూర్తి స్థాయిలో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పిలుపునిచ్చారు.శక్తి కేంద్రం ఇన్చార్జీలు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఓ-2లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్లకు ఫారాలు అందజేసి, తిరిగి సేకరించి అధికారులకు చేరేలా చూడాలని సూచించారు. బోగస్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లను తొలగించేలా సహకరించాలని స్పష్టం చేశారు.ఓటరు జాబితా సవరణ ఒక నెలపాటు కొనసాగుతుందని, సమన్వయంతో పని చేసి పర్ఫెక్ట్ జాబితా తయారీలో కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. అనంతరం 43వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం లక్ష్మి--మొండయ్య గౌడ్, బూత్ అధ్యక్షులు, బీఎల్ఓ-2లు, కార్యకర్తలతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు.

## నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ మేయర్

**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన త్రాగునీరు అందించడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. ఆదివారం ఆయన నగరపాలక సంస్థ నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని సందర్శించి ఫిల్టర్ బెడ్‌లు, మోటార్లు, ప్యానల్ బోర్డులు, బూస్టర్ పంపుల పనితీరును పరిశీలించారు. క్లోరినేషన్ విధానం, నీటి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం మానేరు డ్యాంలో 5.8 టీఎంసీల నీరు ఉందని, రోజుకు 45 ఎంఎల్‌డీ రా వాటర్ సేకరించి 40 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి మట్టం తగ్గినా బూస్టర్ల ద్వారా రాబోయే ఆరు నెలల వరకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభమవడంతో నీటి సరఫరా మరింత సులభం అవుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు.

## కొండగట్టులో వాహన పూజల సందడి



**కొండగట్టు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ భారీగా నెలకొంది. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం చేరుకున్నారు. కొత్తగా కొనుగోలు చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు, వాణిజ్య వాహనాలతో వచ్చిన భక్తులు ప్రత్యేక వాహన పూజలు నిర్వహించారు. వాహనాలను పూలతో అలంకరించి, కొబ్బరికాయలు కొట్టి, నిమ్మకాయలు ఉంచి పూజలు చేశారు. ఆలయ పూజారి అనిల్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజలు జరిగి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు క్యూలైన్లలో క్రమశిక్షణతో స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు ప్రత్యేక అర్చనలు చేయించుకోగా, మరికొందరు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో భజనలు, గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు తాగునీరు, క్యూలైన్లు, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహన పూజలు, ప్రత్యేక అర్చనలు, దర్శనాలతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.కొండగట్టు మరోసారి భక్తి విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.

## బస్సుల నిలుపుదలకై మహిళల రాస్తారోకో



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ బస్సుల నిలుపుదల కోసం స్థానిక మహిళలు ఆదివారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు.జూలై 2025లో రీజినల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, డ్రైవర్లు, కండక్టర్లు బస్సులను ఆపడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రాస్తారోకోతో రాకపోకలు స్తంభించిపోవడంతో పోలీసులు అక్కడకు చేరుకుని సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు తమ నిరసనను విరమించారు.

## రెండు చుక్కలతో వైకల్యం దూరం


**నందికొట్కూరు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పగిడ్యాల రోడ్డులోని ఎంపి యు పి స్కూల్ (సంత గేట్)లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, "0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలి. ఇవి పిల్లల జీవితంలో వైఫల్యాన్ని దూరం చేసి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు రక్షణ కవచంలా నిలుస్తాయి" అని అన్నారు.



7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కమిషనర్, అధికారులు పాల్గొన్నారు.

# గణాంకాల ద్వారా భారత భవిష్యత్తును మలిచిన శాస్త్రవేత్త

ప్రతి సంవత్సరం జూన్ 29న జరుపుకునే జాతీయ గణాంక దినోత్సవం, భారత గణాంక శాస్త్ర పితామహుడు ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా నిర్వహించబడుతుంది. గణాంకాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, ఆధారాలతో కూడిన నిర్ణయాల అవసరాన్ని గుర్తుచేయడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. 1893లో కోల్‌కతాలో జన్మించిన మహలనోబిస్, కేంబ్రిడ్జ్‌లో ఉన్నత విద్యను అభ్యసించి గణాంక శాస్త్రంలో విశేష కృషి చేశారు. ఆయన స్థాపించిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రపంచ ప్రఖ్యాత పరిశోధనా సంస్థగా నిలిచి, దేశానికి వేలాది మంది గణాంక శాస్త్రవేత్తలను అందించింది. 1936లో రూపొందించిన మహలనోబిస్ డిస్టెన్స్ సిద్ధాంతం గణాంక శాస్త్రంలో విప్లవాత్మక ఆవిష్కరణగా నిలిచి, నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగాల్లో విస్తృతంగా వినియోగించబడుతోంది. స్వతంత్ర భారతదేశ ఆర్థిక ప్రణాళికల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. నెహ్రూ--మహలనోబిస్ మోడల్ ఆధారంగా రెండవ పంచవర్ష ప్రణాళిక




అమలులోకి వచ్చి, భారీ పరిశ్రమల అభివృద్ధికి దోహదపడింది. మహలనోబిస్ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం 2007లో జూన్ 29ను జాతీయ గణాంక దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా గణాంకాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం, యువతలో డేటా సైన్స్ పట్ల ఆసక్తి పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ స్థాయిలో అనేక గౌరవాలు అందుకున్న మహలనోబిస్, 1968లో పద్మ విభూషణ్ పురస్కారాన్ని పొందారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తి, డేటా ఆధారిత నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని ఆయన ముందుగానే గుర్తించారు. ప్రశాంత చంద్ర మహలనోబిస్ కేవలం గణాంక శాస్త్రవేత్త మాత్రమే కాదు; భారత అభివృద్ధికి శాస్త్రీయ పునాదులు వేసిన దూరదృష్టి గల మహనీయుడు. ఆయన సిద్ధాంతాలు, పరిశోధనలు, ఆర్థిక ప్రణాళికలు నేటికీ దేశ పురోగతికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.
డేటా నిజాన్ని చెబుతుంది... గణాంకం దేశ ప్రగతికి దిక్సూచి.

**వ్యాసకర్త**
**వేల్పుల మహేందర్,**
**ఎమ్మెస్సీ, ఎం.ఏ., ఎం.ఈడ్**
**అధ్యాపకులు**



## బెల్ట్ షాప్‌పై పోలీసుల దాడి - భారీ మొత్తంలో మద్యం స్వాధీనం



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దుర్శేడ్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై రూరల్ పోలీసులు దాడి చేసి భారీ మొత్తంలో మద్యం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కో-ఆపరేటివ్ సొసైటీ పెట్రోల్ బంక్ సమీపంలో తనిఖీలు జరిపిన పోలీసులు, పలకుర్తి సాయి కృష్ణ తన నివాసంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా 26.630 లీటర్ల పరిమాణంలో, రూ.13,568 విలువ గల ఐఎంఎఫ్ఎల్ మరియు బీర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాల్లో అక్రమ బెల్ట్ షాపులు, గంజాయి, మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు.

## మున్నూరు కాపు జిల్లా అధ్యక్షునిగా జడల సురేందర్ నియామకం



**పెద్దపల్లి, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షునిగా 23వ వార్డు కౌన్సిలర్ జడల సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమాకాంత్, కుంభం సంతోష్, జయప్రకాశ్, అశోక్, ఉప్పు శివకుమార్, విద్యాసాగర్, విక్రాంత్, స్వామి దాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ విగ్రహ పునప్రతిష్ట

**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ఐదవ డివిజన్ బొమ్మకల్ శివారులోని రాజరాజేశ్వరి కాలనీలో ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి దుబ్బపల్లిలో వదిలివేయడంతో, కాలనీవాసులు తిరిగి తీసుకువచ్చి పునప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని, వర్షాన్ని లెక్కచేయకుండా స్వయంగా విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆయన మాట్లాడుతూ, కాలనీలో 20 ఏళ్లుగా బతుకమ్మ, వినాయక, దుర్గ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న స్థలంలో హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, భూకబ్జాదారుల కన్ను పడటంతో విగ్రహాన్ని దొంగిలించారని తెలిపారు. ఇలాంటి చర్యలు మళ్లీ పునరావృతమైతే ప్రజలతో కలిసి గుడి నిర్మిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాదే రూప--శ్రీనివాస్, నాయకులు తోట కిరణ్, లక్ష్మన్, అశోక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**హుస్నాబాద్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన కళాశాల వసతి గృహంలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ పలువురు మున్సిపల్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ప్రజాప్రతినిధులు హాస్టల్‌లో క్రమశిక్షణ, పరిశుభ్రత పాటించాలని, ఉన్నత విద్య ప్రాముఖ్యతను గుర్తించి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, హాస్టల్ సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రత్యేక హాస్టల్ భవనం నిర్మాణానికి స్థల కేటాయింపు అవసరాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లగా, వారు సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న హాస్టల్ సౌకర్యాలు, కామన్ డైట్ మెనూ, విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్లు భుక్య సంపత్ నాయక్, కొండ రజిత సత్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యురాలు భుక్య సరోజన, మండల మహిళ పద్మశాలి సంఘం అధ్యక్షురాలు పంతం కన్యాకుమారి, హాస్టల్ వార్డెన్ బి. విజయ్ కుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి సమస్యలపై వినతి పత్రం సమర్పించిన యువకుల

**ఖానాపూర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



పార్లమెంట్ సభ్యుడు జి. నగేష్ శనివారం రాత్రి ఖానాపూర్ మండల కేంద్రంలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన సందర్భంగా, పట్టణ యువకులు అభివృద్ధి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. పట్టణంలో ఆగిపోయిన రోడ్డు వెడల్పు పనులను తిరిగి ప్రారంభించి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. రహదారులపై ప్రతిరోజూ వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు ప్రయాణిస్తున్నందున రోడ్డు విస్తరణ అత్యవసరమని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో లాయర్ రాజేంద్రనాథ్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై టాస్క్‌ఫోర్స్ దాడి




**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై మెరుపు దాడి చేసి మూడు ట్రాక్టర్లు, రెండు భారీ డంపులను స్వాధీనం చేసుకున్నారు. ఖాజీపూర్ గ్రామ శివారులో మూనెరు నది నుండి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని, పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. అదేవిధంగా బోనాల గ్రామ పరిధిలో నిల్వ ఉంచిన రెండు డంపుల్లో 35 ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మైనింగ్ చట్టాలు మరియు ఇతర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ విద్య విధానంపై ఎస్ఎఫ్ఐ విమర్శలు




**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముకుందల మిశ్రా భవన్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందలేదని, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతలేని ఆహారం అందుతోందని ఆయన అన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, బోగేష్, కమిటీ సభ్యులు సన్నీ, అనిల్, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

## రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

**సుల్తానాబాద్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



సుల్తానాబాద్ రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల ప్రక్రియను ఏ. బుచ్చిరెడ్డి, అబ్దుల్ ఖాలీక్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఏ. రామేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి ప్రకాష్ రావు పెద్దన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం. రవీందర్, గేమ్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా డి. రమేష్, ఆర్థిక కార్యదర్శిగా వై. శ్రీధర్ బాధ్యతలు చేపట్టనున్నారు. సభ్యులుగా ఎం. రాజేంద్ర ప్రసాద్, డి. దామోదర్ రావు, వీ. రామ్మూర్తి, కే. మైసయ్య, ఎం. ప్రవీణ్ కుమార్, వి. లక్ష్మణ్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందిస్తూ, వారి నాయకత్వంలో క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, వినోద కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ యువతను భాగస్వాములను చేస్తామని తెలిపారు. సభ స్నేహపూర్వక వాతావరణంలో ముగియగా, క్లబ్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సభ్యులు సంకల్పించారు.

## కారు--బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**ఖానాపూర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ఖానాపూర్ మండలంలోని నిర్మల్--మంచిర్యాల్ రహదారిపై రాజురా చౌరస్తా వద్ద ఆదివారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో మామడ మండల తండాకు చెందిన గంగారాం (61) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన కాలు విరగడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వోడితెల ప్రణవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు



**హుజురాబాద్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇల్లందకుంట మండల కేంద్రంలో నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి కృషి చేసిన హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వోడితెల ప్రణవ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, డిసిసి అధ్యక్షుడు సత్యం, వోడితెల ప్రణవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ పునర్నిర్మాణానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇల్లందకుంట మండల తహసిల్దార్ కార్యాలయానికి నిధులు మంజూరుచేయడం కాంగ్రెస్ ప్రభుత్వమే సాధ్యమైందని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రణవ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 26వ డివిజన్‌లో నీటి పైపుల మరమ్మత్తులు



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
26వ డివిజన్‌లో మంచినీటి పైపులైన్‌లో ఏర్పడిన లీకేజీలను స్థానిక కార్పొరేటర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. మున్సిపల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఫిటర్ సాజిద్, లైన్‌మెన్ లక్ష్మణ్‌లతో కలిసి లీకేజీ ప్రాంతాలను పరిశీలించి మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడడమే తమ ప్రథమ కర్తవ్యమని అంజన్ కుమార్ తెలిపారు. లీకేజీల వల్ల నీరు వృథా కావడంతో పాటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు పూర్తి చేసి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు ఎక్కడైనా లీకేజీలు గమనిస్తే వెంటనే మున్సిపల్ సిబ్బంది లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టీఎన్జీవోల సమక్షంలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పే అండ్ అకౌంట్స్ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఎం. వెంకటేశ్వర రాజు పదవీ విరమణ సందర్భంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ భవనంలో ఉద్యోగులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి ఉద్యోగులు, అధికారులు, పదవీ విరమణ పొందిన నాయకులు హాజరై ఆయనను మెమెంటోలు, పుష్పగుచ్ఛాలు, గజమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా జేఏసీ చైర్మన్ బొంకురి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమైనదే అయినప్పటికీ, వెంకటేశ్వర రాజు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల పట్ల ఆయన చూపిన ఆప్యాయత, నిష్పక్షపాత వైఖరి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్ గౌడ్, టీఎన్జీవో నాయకులు ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, సర్దార్ మహేందర్ సింగ్, రాగి శ్రీనివాస్, హరికృష్ణ, ఒంటెల రవీందర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గంగారపు రమేష్, పోలు కిషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, సుధాకర్ రెడ్డి, శ్రీమాన్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమాలు

**కరీంనగర్/నిర్మల్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. రేణికుంటలో సర్పంచ్ ఎలుక అంజనేయులు, గన్నేరువరం గ్రామంలో సర్పంచ్ మాదరి శ్రీనివాస్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గణేష్ నగర్‌లో కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ, హుజురాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఖానాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమాన్ని ప్రారంభించి, చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు అని తల్లిదండ్రులను పిలుపునిచ్చారు. దిలావర్పూర్ గ్రామంలో సర్పంచ్ చింతల మల్లేష్, వార్డ్ మెంబర్ వాలుగోటు లాస్య ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రెండు చుక్కలు -- ప్రతి చిన్నారికి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అనే నినాదంతో పోలియో రహిత భారత నిర్మాణం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## ఘనంగా పీవీ నరసింహరావు జయంతి వేడుకలు

**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు 105వ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొని పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ, పీవీ నరసింహారావు బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణలకు రూపకర్తగా దేశాన్ని ముందంజలో నిలిపారని కొనియాడారు. హుస్నాబాద్‌లో సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో, కోహెడ మండలంలో కాంగ్రెస్ నాయకులు శెట్టి సుధాకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని పీవీ సేవలను స్మరించారు. ఆయన విద్యాశాఖ మంత్రిగా గురుకుల విద్యకు శ్రీకారం చుట్టడం, హెచ్ఆర్డీ మంత్రిగా నవోదయ విద్యాలయాల స్థాపన, జైళ్ల శాఖ మంత్రిగా ఓపెన్ జైల్ విధానం ప్రవేశపెట్టడం వంటి సంస్కరణలను గుర్తు చేశారు. హుజురాబాద్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వోడితెల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ఆధ్వర్యంలో భారీగా నివాళులు అర్పించారు. సుల్తానాబాద్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాన్నాయక్ దామోదర్ రావు ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహం వద్ద కార్యక్రమం జరిగింది. హుస్నాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, స్థానిక నాయకులు పాల్గొని పీవీ సేవలను స్మరించారు. నాయకులు మాట్లాడుతూ, పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని గాడిలో పెట్టిన అపర చాణక్యుడని, తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించిన సాహితీవేత్త అని కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పీవీ నరసింహారావు సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## 56వ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రారంభం

**రామగుండం, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంను రామగుండం మున్సిపల్ పరిధిలోని 56వ డివిజన్‌లో కార్పొరేటర్ కొమ్ము స్వప్న వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను మ్యాపింగ్ చేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్ ఇంచార్జ్ సింహాచలం, బీఎల్ఓలు, ఆర్పీలు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు. కార్పొరేటర్ స్వప్న వేణు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ ప్రజలతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారించాలని ఏఐటీయూసీ డిమాండ్



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన జిల్లా మహాసభలో వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనం 18,000 ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి, ప్రతినెల ఐదో తేదీకి వేతనాలు చెల్లించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు వస్తువులు సరఫరా చేస్తున్న విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కూడా పప్పులు, నూనెలు, గుడ్లు, కూరగాయలు ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. మహాసభ అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టేకుమల్ల సమ్మయ్య, బొజ్జ సాయిలు, ఉపాధ్యక్షులుగా లక్ష్మి, దేవమ్మ, ప్రధాన కార్యదర్శిగా కె. రజిత, సహాయ కార్యదర్శులుగా కవిత, సరోజన, సభ్యులుగా సరోజన, కనకమ్మ, కవితలను ఎన్నుకున్నారు.

## వరద కాలువ నీటి కోసం మహాధర్నా



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సాగునీటి విడుదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో రైతులు మహాధర్నా నిర్వహించారు. నాగులమల్యాల శివారులోని ఆచంపల్లి వరద కాలువ ఓటీ స్లూయిస్ వద్ద వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. గంగుల మాట్లాడుతూ, మేడిగడ్డ నుంచి సాగునీరు విడుదల చేయకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందించేలా కేసీఆర్ కృషి చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కారణాలతో మోటార్లు నడపడం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. వారం రోజుల్లోగా నీరు విడుదల చేయకపోతే వరద కాలువలో మోటార్లు ఏర్పాటు చేసి రైతులకు నీరు అందిస్తామని, అవసరమైతే కేటీఆర్, హరీశ్ రావు, ప్రజా ప్రతినిధులతో కలిసి కన్నెపల్లి వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన సుమారు వెయ్యి మంది రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారి నిధిశ్రీకి స్థానం

**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మంకమ్మతోటకు చెందిన ఐదేళ్ల చిన్నారి బొబ్బిలి నిధిశ్రీ పటేల్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్--2026లో పేరు నమోదు చేసుకుంది. ఒక నిమిషంలో 112 తైక్వాండో కిక్స్ ప్రదర్శించి రికార్డులో స్థానం సంపాదించింది. నిధిశ్రీ నాలుగేళ్ల వయసులోనే తైక్వాండో సాధన ప్రారంభించి, రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ జూన్ 3న ధృవీకరించింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చిన్నారిని అభినందిస్తూ, భవిష్యత్తులో దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రవీందర్ సింగ్, పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ నలువాల పుష్పలత--రవీందర్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఘంటసాల గంగాధర్ మృతి

**ఖానాపూర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ఖానాపూర్ శ్రీరామ్ నగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు శ్యామల ఘంటసాల గంగాధర్ శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మరణం తీరని లోటు అని పద్మశాలి సంఘం, జంగల్ హనుమాన్ కమిటీ, హిందూ ఉత్సవ సమితి తదితర సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. రిటైర్మెంట్ అనంతరం ఘంటసాల పాటలు, భక్తి గీతాలు ఆలపిస్తూ ప్రజలను అలరించిన గంగాధర్, సాయిబాబా వార్షికోత్సవాలు, వినాయక నిమజ్జనం, బతుకమ్మ పండుగలలో తన గానంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన వాగ్ధాటి, గాన ప్రతిభతో ప్రజా సమావేశాలను ఉత్సాహపరిచిన ఘంటసాల గంగాధర్ ఇక లేరని స్థానిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి.

# ఘనంగా 135వ మన్ కీ బాత్ కార్యక్రమం



**కరీంనగర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లలో, అలాగే హుజురాబాద్, సుల్తానాబాద్ మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వీక్షించారు. 36వ డివిజన్‌లో కార్పొరేటర్ దేవసాని సరస్వతి, తోట అనిల్ పాల్గొనగా, 23వ డివిజన్‌లో మేయర్ కొలగాని శ్రీనివాస్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. 42వ డివిజన్‌లో కొమ్మెర రవీందర్ రెడ్డి, 49వ డివిజన్‌లో గాజ రమ, ఎన్నం లక్ష్మి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. 57వ డివిజన్ గణేష్ నగర్‌లో కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా నాయకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. హుజురాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నేతృత్వంలో కార్యక్రమం అనంతరం ఎస్‌ఐఆర్ సమీక్ష సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్, రక్షణ రంగంలో స్వదేశీ పరికరాల తయారీ, జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రజలకు మార్గనిర్దేశం చేశారని తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలంలో బీజేపీ దళిత మోర్చా నాయకులు, బూత్ అధ్యక్షులు గాలిపెల్లి నారాయణ ఇంటివద్ద కార్యక్రమం నిర్వహించారు. సుల్తానాబాద్‌లో ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు పాల్గొని మోదీ ఆలోచనలు దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మన్ కీ బాత్ ద్వారా ప్రధాని ప్రజలతో నేరుగా మమేకమవుతూ దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములుగా మార్చుతున్నారని నాయకులు అభిప్రాయపడ్డారు.

# బిఆర్ఎస్ బిఎల్ఏలకు ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సు



**పెద్దపల్లి, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బిఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన కల్పిస్తూ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఎల్ఏలు నియమ నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని ప్రజలకు సరైన సమాచారం అందించాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ కార్యక్రమం పారదర్శకంగా సాగేందుకు సహకరించాలని, పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బిఎల్ఏలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మండల అధ్యక్షులు మార్క లక్ష్మణ్, ఐరెడ్డి వెంకటరెడ్డి, రామ్ రెడ్డి, నాయకులు బాయిని రాజమల్లు, దేవయ్య, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, సర్పంచులు కుమారి, మచ్చ యాదగిరి అరుణ, పటాకుల అనుష, అనీల్, బిఎల్ఏలు పాల్గొన్నారు.

# దవాఖానలో ఎక్స్‌రే సమస్యపై సిపిఎం ఆందోళన



**ఖానాపూర్, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో ఎక్స్‌రే పనిచేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం ప్రజాసంఘాల నాయకులు ఆదివారం దవాఖానను సందర్శించి సమస్యలను పరిశీలించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, ఇతర నాయకులు పాల్గొని కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, శ్రమదోపిడిని ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దవాఖానలో పనిచేస్తున్న 26 మంది కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వాలని, రిపేర్లు చేసి వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని, మహిళా ఉద్యోగుల కోసం సౌకర్యవంతమైన టాయిలెట్లు, సీసీ ప్లాట్‌ఫార్మ్ నిర్మించాలని వారు కోరారు. డాక్టర్లు డిప్యూటేషన్‌పై ఇతర మండలాలకు వెళ్లడం వల్ల రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వారిని తిరిగి ఖానాపూర్ దవాఖానలోనే నియమించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం



నారాయణపల్లి లో సర్పంచ్ రంగు లత శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ బాపురెడ్డి



ఎలిగేడు గ్రామపంచాయతీలో పోలియో చుక్కలు వేస్తున్న స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్



రేకల్దేవ్ పల్లి లో సర్పంచ్ మద్దెల రమదేవి సంపత్, ఉప సర్పంచ్ బొడిగ శివకృష్ణ



నర్సాపూర్ స్థానిక సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్



నర్సాపూర్ లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉప ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాములు

**ఎలిగేడు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని పెద్దపల్లి జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల పరిధిలో పలు గ్రామాల్లో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ఒక్క చిన్నారి కూడా మిగలకుండా అందరికీ పోలియో చుక్కలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి" అని సూచించారు. మండల పరిధిలో 1,225 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మొదటి రోజు వేయించలేని వారికి జూన్ 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే ద్వారా పోలియో చుక్కలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ సర్వేలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహసిల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్ రావు, మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టిన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల బంగారు భవితకు రెండు చుక్కలు

## - జిల్లా కలెక్టర్ రాజకుమారి



**నంద్యాల, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మూలసాగరంలోని ఎంఎస్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "భారతదేశం పోలియో రహిత దేశంగా ఉన్నప్పటికీ చుట్టుపక్కల దేశాల్లో కేసులు నమోదవుతున్నాయి. పిల్లలను రక్షించేందుకు సంవత్సరానికి రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. అందుకే 0--5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి" అని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 2 లక్షల 38 వేల చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు 1,320 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణాల్లో ఉన్న చిన్నారుల కోసం బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద కూడా కేంద్రాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. జ్వరం, జలుబు, విరేచనాలు ఉన్న పిల్లలకు కూడా ఈ టీకాలు వేయించవచ్చని, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా బాధ్యతగా పాల్గొనాలని సూచించారు. అదనంగా, జూన్ 29, 30 తేదీల్లో మాప్-అప్ కార్యక్రమం ద్వారా మిగిలిపోయిన పిల్లలకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు అందజేస్తారని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పంచాయతీ, స్త్రీ--శిశు సంక్షేమ, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, మెప్మా పీడీ వెంకట దాసు, నోడల్ ఆఫీసర్ రమేష్, ఇమ్యునైజేషన్ అధికారి సుదర్శన్ బాబు, ప్రోగ్రామ్ అధికారులు శారద బాయ్, లక్ష్మీ ప్రసన్న, డా. ఎన్టీఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేర నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ అండ్ సెర్చ్





**నంద్యాల, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, మాదకద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా ఆపరేషన్ వజ్రపహార్ లో భాగంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు తెల్లవారుజామున వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల్లో అధికారులు, సిబ్బంది కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. అక్రమ మద్యం కలిగి ఉన్నవారిని అరెస్టు చేసి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అనుమానాస్పద వ్యక్తులు, నేర చరిత్ర గలవారు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112 టోల్ ఫ్రీ నంబర్లకు, బాల్యవివాహాల నివారణకు 1098, సైబర్ నేరాల నివారణకు 1930 నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చని ప్రజలకు తెలియజేశారు.

# విద్యుత్ అంతరాయంపై ప్రజల ఆగ్రహం

**నందికొట్కూరు, జూన్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూపాడు బంగ్లా మండలంలో గత రెండు రోజులుగా వాన లేకుండా, గాలి లేకుండా రాత్రివేళల్లో విద్యుత్ నిలిపివేయడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని సిపిఎం మండల కన్వీనర్ ఎం. కర్ణ ఆరోపించారు. ఆదివారం పారుమంచాల గ్రామంలో ప్రజలతో సమావేశమై ఆయన మాట్లాడుతూ, రాత్రివేళల్లో విద్యుత్ లేకపోవడం వల్ల పసిపిల్లలు దోమల కాటుకు గురై డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదేవిధంగా విద్యుత్ లేకపోవడం దొంగతనాలకు అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని రాత్రివేళల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రషీద్, పెద్ద శివన్న, గోపి స్వామి దాస్, ఖాదర్ బాషా, గొల్ల రోశన్న తదితరులు పాల్గొన్నారు.





## కొత్త లుక్‌లో కేక పుట్టిస్తోన్న పూజా హెగ్డే..

# పారిపోయి పెళ్లి చేసుకుందాం అనుకున్నా..

### కానీ ఇలా జరుగుతుందని అనుకోలేదు : స్టార్ హీరోయిన్



సినీ సెలబ్రెటీల వ్యక్తిగత జీవిత ఎప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ముఖ్యంగా ప్రేమలు పెళ్లికి సంబంధించిన ఎన్నో న్యూస్ చక్కర్లు కొడుతూ ఉంటాయి. ఇటీవల చాలా మంది సెలబ్రెటీలు పెళ్లి చేసుకొని కొత్త జీవితాలను మొదలుపెడుతుంటే.. మరికొందరు విడాకులు అనౌన్స్ చేస్తూ అభిమానులకు షాక్ ఇస్తున్నారు. యంగ్ హీరోలు, యంగ్ హీరోయిన్స్ మాత్రమే కాదు సీనియర్ హీరోలు కూడా విడిపోతున్నాం అంటూ అనౌన్స్ చేసి అవాక్ అయ్యేలా చేస్తున్నారు. ఇటీవలే ఓ స్టార్ హీరోయిన్ పెళ్లి చేసుకొని అభిమానులకు షాక్ ఇచ్చింది. తెలుగులో తక్కువ సమయంలోనే ఈ అమ్మడు స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ఇటీవలే ఈ అమ్మడు ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించింది. పెద్దలు ఒప్పుకోకపోతే పారిపోయి పెళ్లి చేసుకుందాం అనుకున్నా అని తెలిపింది అందాల భామ కీర్తిసురేష్. తెలుగులో తక్కువ సమయంలో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్నముద్దుగుమ్మల్లో కీర్తిసురేష్ ఒకరు. తమిళ్ ఇండస్ట్రీ నుంచి తెలుగులోకి అడుగుపెట్టింది ఈ అమ్మడు. రామ్ పోతినేని హీరోగా నటించిన నేను శైలజ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది కీర్తి. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసింది. ఇక మహానటి సినిమాతో తెలుగులో ప్రేక్షకులకు మరింత దగ్గరైయింది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత స్టార్ హీరోల సినిమాల్లో నటించింది కీర్తిసురేష్. మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్ హీరోల సరసన నటించింది. ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న ఈ అందాల భామ.మొన్నామధ్య పెళ్లి చేసుకొని అభిమానులకు షాక్ ఇచ్చింది. తన ప్రియుడు ఆంటోని తటిల్ ను కీర్తి 2024లో వివాహం చేసుకుందివీరిద్దరి పెళ్లి హిందూ, క్రిస్టియన్ సంప్రదాయల ప్రకారం జరిగింది. దాదాపు 15 ఏళ్లు రిలేషన్ లో ఉన్న ఈ ఇద్దరూ పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో యాక్టివ్ గా ఉంది కీర్తి. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రేక్షకులను అలరించింది. కాగా గతంలో ఓ ఇంటర్వ్యూలో కీర్తిసురేష్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఆ ఇంటర్వ్యూలో కీర్తిసురేష్ మాట్లాడుతూ.. ఆంటోనీ గురించి తన ఇంట్లో తెలిస్తే ఖచ్చితంగా మా పెళ్లికి ఒప్పుకోరని అనుకున్నాం.. ఒకవేళ మా పెళ్ళికి ఒప్పుకోకపోతే ఇంటి నుంచి పారిపోయి పెళ్లి చేసుకోవాలనున్నా.. కానీ మా ప్రేమ గురించి చెప్పగానే పెద్దలు పెళ్లికి ఒప్పుకున్నారు అలాగే ఎంతో గ్రాండ్ గా పెళ్లి చేశారు. ఇంత గ్రాండ్ గా మా ఫ్యామిలీస్ సమక్షంలో మా పెళ్లి జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు.. అందుకే పెళ్లి సమయంలో నేను నా భర్త ఎమోషనల్ అయ్యాం అని చెప్పుకొచ్చింది కీర్తిసురేష్.

## పవనిజం లింక్‌తో 'హే చికీతా'...
## రైతే రాజు కాన్సెప్ట్‌తో టీజర్




బద్రి సినిమాలో హే చికీతా అంటూ వచ్చే పవన్ కళ్యాణ్ సాంగ్ బాక్సాఫీస్‌ను ఏ రేంజ్‌లో షేక్ చేసిందో తెలిసిందే. అప్పటికీ ఎప్పటికీ ఆల్‌టైమ్ ఫేవరేట్ సాంగ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కళ్యాణ్ మ్యానరిజం టచ్ చేస్తూ 'హే చికీతా' టైటిల్‌లో సినిమా చేస్తూ మూవీ లవర్స్ ఫోకస్ తనవైపు తిప్పుకుంటున్నాడు డైరెక్టర్ ధన్ రాజ్ లెక్కల. ఈ మూవీలో టెలివిజన్ స్టార్ యాక్టర్, సినీ నటుడు ప్రభాకర్ కూతురు దివిజ హీరోయిన్‌గా నటిస్తోండగా.. ప్రభాకర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.అభినవ్ మణికంఠ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని జులై 24న విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా పాపులర్ సినిమాటోగ్రఫర్ కేకే సెంథిల్ కుమార్ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఓ వైపు లవ్, రిలేషన్స్, మరోవైపు వ్యవసాయం వంటి అంశాలను సినిమాలో చూపించబోతున్నట్టు టీజర్ చెబుతోంది. డైరెక్టర్ ధన్ రాజ్‌లెక్కల మాట్లాడుతూ.. ఊరిలో ఉండే ఓ ఐదుగురు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఏం చేశారనేదే సినిమా కథ అని.. అందుకే ఈ హే చికీతా టైటిల్ పెట్టాం. పవన్ కళ్యాణ్ ప్రతీ సినిమాలో ఇంట్రో సాంగ్‌లో 3 నిమిషాల పాటు మెసేజ్ ఇస్తారు.. నేను కూడా అదే లైన్‌లో రైతుల గురించి 3 గంటలపాటు సినిమా చేశానన్నాడు.సుందరకాండ మోషన్ పిక్చర్స్, ఎల్ఎల్‌పీ బ్యానర్లపై గరుడ వేగ ఫేం అంజి, ఎన్ అశోక్ ఆర్ఎన్ఎస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో తన్మయి కుషి, దేవీ ప్రసాద్, బలగం సుజాత, అంజిమామ ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఆ హీరోతో నటించాలంటే చాలా భయమేసింది..

టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ ఇప్పుడు చాలా బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె నాగబంధం అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్, రాబోయే ప్రాజెక్టులు, వివిధ సహనటులతో కలిసి పనిచేసిన అనుభవాలపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ప్రధానంగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ తో తన తొలి సినిమా షూటింగ్ అనుభవం గురించి ఆమె మాట్లాడారు.ప్రస్తుతం నాభా నటేష్ నాగబంధం అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ కథ తనని ఎంతగానో ఆకట్టుకుందని, పాత జానపద కథలను, ఫెయిరీ టేల్స్ ను గుర్తుచేస్తుందని ఆమె తెలిపారు. గతంలో ఏ చిత్రంలోనూ అన్వేషించని కొన్ని అంశాలను నాగబంధం ద్వారా చూపించనున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ చిత్రంతో పాటు స్వయంభు అనే మరో ఫాంటసీ చిత్రంలో కూడా ఆమె నటిస్తున్నారు. నాగబంధం కన్నా ముందే స్వయంభుకు సంతకం చేశానని, మైథలాజికల్ లేదా పీరియాడిక్ స్పేస్ లో తనకు అదే తొలి అనుభవమని నాభా నటేష్ వివరించారు.స్వయంభు సెట్స్ లోకి అడుగుపెట్టినప్పుడు, కాస్ట్యూమ్స్ ధరించినప్పుడు టైమ్ ట్రావెల్ చేసిన భావన కలిగిందని, ఆ వాతావరణం చాలా అందంగా ఉందని ఆమె అన్నారు. స్వయంభులో తన పాత్ర పార్వతితో పోలిస్తే చాలా భిన్నంగా, శక్తివంతంగా ఉంటుందని తెలిపారు. స్వయంభులో తన సహనటుడు నిఖిల్ సిద్ధార్థతో కలిసి పనిచేసిన అనుభవం గురించి మాట్లాడుతూ, ఆయన చాలా సరదాగా, ప్రతిభావంతుడిగా, కష్టపడే తత్వం కలవాడు అని అన్నారు.నిఖిల్ ఎంతో అవుట్ స్పోకెన్ అని, ఎటువంటి విషయాలు దాచుకోడని, ఫుట్ బాల్, జీవితం గురించి మాట్లాడటానికి ఆసక్తి చూపుతాడని ఆమె చెప్పారు. నిఖిల్ నటించిన కార్తికేయ 2 సినిమా తనకు చాలా ఇష్టమని, ఆ సినిమాను పదిసార్లు చూశానని, దానిలోని కృష్ణ ట్యూన్ ఎంతో బాగుంటుందని నభా నటేష్ అన్నారు. తన వ్యక్తిగత లక్షణాల గురించి మాట్లాడుతూ, తన బలం, బలహీనత రెండూ ఒకటేనని, అది ప్రతి దానిలో మంచిని చూడటమేనని నభా నటేష్ తెలిపారు.తన కెరీర్ కన్నడలో ప్రారంభమైందని నాభా నటేష్ గుర్తుచేసుకున్నారు. అక్కడ కన్నడ సూపర్ స్టార్, కరుణాడ చక్రవర్తి శివరాజ్ కుమార్ తో తన తొలి సినిమాలో నటించే అవకాశం లభించిందని ఆమె తెలిపారు. శివరాజ్ కుమార్ స్థాయిని చూసి మొదట్లో చాలా భయం వేసిందని, అప్పట్లో గుర్రం నడపడం, బీడీ తాగడం వంటి మాస్ లక్షణాలు ఉన్న ఒక క్లిష్టమైన పాత్రను చేశానని నాభా నటేష్ వివరించారు. మళ్లీ అలాంటి మాస్ పాత్రను చేయలేదని ఆమె అన్నారు. ఆయన చిత్రాలను చూసిన తనకు, ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా భయమేసిందని నభా నటేష్ పేర్కొన్నారు.



## ఆకట్టుకుంటున్న 'హ్యాపీ జర్నీ' టీజర్!

విభిన్న వయసులు, భిన్న మనస్తత్వాలు కలిగిన ఏడుగురు మహిళలు కలిసి ప్యారిస్ వెకేషన్‌కు వెళ్తే ఎలాంటి క్రేజీ అనుభవాలు ఎదురయ్యాయి అనే ఆసక్తికరమైన కథాంశంతో టాలీవుడ్‌లో సరికొత్త చిత్రం తెరకెక్కుతోంది. అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ 'హ్యాపీ జర్నీ' చిత్ర అధికారిక టీజర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. సాధారణంగా వచ్చే కమర్షియల్, పురుష ప్రధాన సినిమాలకు భిన్నంగా, పూర్తిగా మహిళల ఎమోషనల్ బాండింగ్ మరియు రోడ్-ట్రిప్ చుట్టూ తిరిగే హార్ట్-వార్మింగ్ డ్రామాగా ఈ సినిమా రూపొందింది. తమ జీవితాల్లోని బాధలు, ఒత్తిడిని మర్చిపోవడానికి ప్యారిస్ ప్రయాణమైన ఏడుగురు మహిళల జీవితాలు అక్కడ ఎలాంటి మలుపు తిరిగాయనేది ఈ చిత్రంలో చూపించబోతున్నారు.ఈ సినిమాలో సీనియర్ నటీమణులు అన్నపూర్ణమ్మ, ఆమనిలతో పాటు యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్యారిస్ బ్యాక్‌డ్రాప్‌లో అన్నపూర్ణమ్మ, ఆమనిల సందడి ఈ టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే వంశీధర్ గౌడ్, పృథ్వీ దండమూడి, రవి శివతేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాను గుట్ట ప్రొడక్షన్స్ మరియు కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ పతాకాలపై బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ, ఛోటా కె. ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్యారిస్, మాంట్పెలియర్ లాంటి అందమైన యూరోపియన్ లొకేషన్లలో రిఫ్రెషింగ్ విజువల్స్‌తో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది.

